


సద్గురు లీలా తరంగిణి

# గురుకృప

గురుపూర్ణిమ సంచిక

## అభయం సర్వభూతేషు



# సద్గురుబోధ..

"గురువుకు పగ్గాలప్పగించి
నిశ్చింతగా ఊరక కూర్చుంటే చాలు!
చేయవలసిందంతా నేను చేసి,
మిమ్ములను చివరికంటా గమ్యం
చేరుస్తాను!" – అన్న శ్రీ సాయి
ఉపదేశం ఆయన బోధన సారమని
చెప్పవచ్చు.

సద్గురు వాక్యం మనలో దైవం
పట్ల జిజ్ఞాసను, విచారణను
రేకెత్తించి, తరింపుకు
బాట వేస్తుంది.

శ్రీ సాయిబోధ సమగ్రమైనదే ;
మన అవగాహనే సమగ్రం
కావలసివుంది.

-సాయిభక్తి సాధన రహస్యం

www.saibaba.com

సంపుటి : 11 గురుకృప సంచిక : 3



# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ధ నిశీధిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాధుని అనన్య ప్రేమతో ఆర్ధ్రతతో
ప్రార్ధించడమే మనం చేయగలిగింది, చేయవలసింది. - శ్రీ బాబూజీ




## లోపలి పేజీలలో


ఉన్నమాట-అనుకున్నమాట 4
- గురుబంధువులు

అనుగ్రహమే అసలు సంపాదన 8
- సుప్రజ

నా వెంట తానుంటే 11
- గోపవరపు రత్నమాల

చింత-నిశ్చింత 13
- రామచంద్రరావు

నా ఆజ్ఞ లేక ఆకైనా కదలదు 15
- కామేశ్వరరావు

ప్రత్యక్ష దైవం 17
- 'సత్య' సంకలనాలు

ఇంకా మరికొన్ని లోపలి పేజీలలో...


**GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01. Ph : 93933 61778**
**Printed at : Ramakrishna Printers, Visakhapatnam. Ph : 2740222**

# ఉన్నమాట-అనుకున్నమాట

– గురుబంధువులు

'ఉన్నమాట-అనుకున్నమాట' అసలు ఏమిటి? ఈ శీర్షిక ప్రధాన ఉద్దేశ్యం ఏమిటి? ఈ శీర్షికకు ఇలాంటి పేరు ఎందుకు? అసలు 'ఉన్నమాట' ఏమిటి? 'అనుకున్నమాట' ఏమిటి? అని విశ్లేషిస్తే 'ఉన్నమాట- ఏమంటే ఉన్నది ఒక్కటే' అదీ 'సద్గురువే' – ఎందుకంటే అది సత్య స్వరూపం. భాసించే జగత్తును శాసించే అద్భుత తత్త్వం. ఉన్నది సద్గురువే అయితే – ఈ మాటలు సద్గురుతత్త్వానికి అక్షర నీరాజనాలవ్వాలనేది ఈ శీర్షిక ప్రధానోద్దేశ్యం. రాసిన మాటలు గురుబంధువులకు సద్గురు ఊసులుగా (బాహ్యంగా) సాగితే, మనమందరం కలిసి 'అనుకునే మాటలు' మనలో సద్గురు ధ్యాసలుగా (అంతరంగంలో) నిలవాలని ఆకాంక్షిస్తూ చేస్తున్నదే ఈ ప్రయత్నం. లోక కళ్యాణం చేయ వేంచేసిన సాయినాథుని అనుగ్రహ ఒడిలో గురుదేవుల కళ్యాణోత్సవం రోజున సాగిన కళ్యాణ వేడుకలు ఇంకా కనులలో మెదలుతున్నాయి. అనుక్షణమూ సాయితో మెలిగే సాయిభక్తులంతా వారి వ్యక్తిత్వపు పరిమితులను దాటి అందరూ ఏకమై సద్గురు సన్నిధిని ఆలంబనగా చేసుకొని, అణువణువు సాయిని నింపుకొని, సాయితో కలుద్దామనే ప్రయత్నంలో ఉన్నారా అన్నట్లు సాగిన సాయి నామం ఇంకా చెవులలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. పరిపూర్ణ సద్గురుస్వరూపం యొక్క అనుగ్రహాశీస్సుల ఆనంద హేల ఇంకా స్మృతిపథంలో సాగుతుండగానే గురు'పూర్ణిమ' పర్వదినం రానే వచ్చింది. గురుపూర్ణిమకు మన దగ్గర 'ఉన్న' మాటలు ఏమిటా అని ఆలోచిస్తే, గురుదేవులు 'గురుపూర్ణిమ' గురించి చెప్పిన మాటల కంటే అవలోకించదగినవి, ఆలోచించ దగినవి, ఆచరించదగినవి ఏముంటాయి అనిపించింది. ఆ మాటల కంటే మనం 'అనుకోవాల్సిన' మాటలు ఏముంటాయి అని అనిపించింది. గతసంచికలలో ఈ సత్సంగాన్ని గురుబంధువులకు అందించినప్పటికిని, సద్గురు భక్తి ఉద్యమంలోని రసగుళికలాంటి ఈ సత్సంగం మీ అందరికోసం మరొక్కసారి.

పండుగలు పలువిధాలు. వాటిలో గ్రహ, ఆధ్యాత్మిక సంబంధమైనవి, ఋతు సంబంధమైనవి. రాజకీయ, మత, సామాజిక రంగాలలో పెద్ద సంస్కరణల మార్పుకు కారణభూతులైన యుగ పురుషులు, మహాత్ములు వంటి వారి జన్మదినోత్సవాలు, శ్రీరామనవమి, శ్రీకృష్ణాష్టమి, బుద్ధ జయంతి మొ॥నవి. ఆధ్యాత్మికపరమైన రెండవ రకం పండుగలలో ఉపాసనా సంబంధమైనవి అంటే గాణపత్యులకు – గణపతే దైవం, గణపతి పరబ్రహ్మ స్వరూపం – ఆయనే గమ్యం. ఇలా గణపతిని ఉపాసన చేసుకునే వాళ్లు చేసుకునే పండుగ వినాయకచవితి. అలా అన్ని






సమాజాల వాళ్లు చేసుకుంటూ పోగా ప్రతి వాళ్లకు పండుగలు వచ్చాయి. నిజానికి అన్నిరకాల వాళ్లు చేసుకోవాల్సినవి కావు ఇవన్నీ! సాయి భక్తులకు బాబానే సద్గురువు, ఆయనే దైవం. ఆయనే మార్గం కనుక ఆయన చెప్పిన పండుగ ఏదైతే ఉందో అదొక్కటే సాయి భక్తులకు పండుగ. అందుకే సాయిభక్తులకు ప్రధానమైన పండుగ బాబా చెప్పినటువంటి "గురుపూర్ణిమ". అయితే ఇన్ని పండుగలు ఉండగా బాబా గురుపూర్ణిమనే చేసుకొమ్మని ఎందుకు చెప్పారు? అసలు చరిత్రలో ఏం జరిగింది? ఎప్పటిలానే గురుపూర్ణిమను శిరిడీలో ఉండే భక్తులెవరూ పట్టించుకోలేదు. బాబా దాదాకేల్కర్ అను భక్తుడ్ని పిలిచి కేకలేశారు. చేసుకోండి అని మామూలుగా చెప్పడం కాదు – "గురుపూర్ణిమ అని తెలియదా ఈ రోజున? గురువుకు పూజ చేయాలని తెలియదా? అదుగో పో, పోయి ఆ స్తంభానికి పూజ చేసుకో" అని చెప్పారు బాబా. ఎందుకు చెప్పారు బాబా? గురుపూర్ణిమ యొక్క ప్రాశస్త్యం ఏమిటి? అంటే ఆధ్యాత్మికంగా మనకు ఉపయోగపడే పండుగలు మన గమ్యానికి మనల్ని తొందరగా తీసుకుపోయే దానికి వీలుగా ఆ వైపు గాలి వీచే తెరచాపలాంటిదనుకుందాం!

గమ్యం వైపుకు పోవాలనుకునేవాడు గాలి వీస్తున్నవైపు తెరచాప ఎత్తుతాడు – ఆ ఫోర్స్‌కి ఇంకా బాగా వెళ్లగలుగుతాడు. ఆ సమయంలో మన మనస్సనే తెరచాపను ఎత్తితే మన గమ్యం వైపున మనం ఇంకా ముందుకు వెళ్లగలుగుతాం. మనసుమీద ప్రభావం ఎక్కువగా చంద్రుడి వల్ల ఉంటుంది. మానసిక గతిని అదుపు చేసేది చంద్రుడట. చంద్రుడి యొక్క ప్రభావం మనసు మీద పూర్తిగా వున్న రోజును పూర్ణిమ అన్నారు – పూర్ణంగా ఉంటుంది కనుక. గురుపూర్ణిమ రోజున ఏమవుతుంది? గురువు యొక్క పూర్తి అనుగ్రహం, చల్లనైనటువంటి జ్ఞానమనే వెన్నెల మనమీద పూర్ణంగా వర్షిస్తూ ఉంటుంది. కనుక ఆ సమయంలో వ్యర్థ ఆలోచనల నుండి మనం జాగరూకులం అవ్వాలి. గురుపూర్ణిమ ఘడియలలో మనం ఆలోచిద్దామన్నా ఆలోచనలు రావు. జాగ్రత్తగా ఉంటే వచ్చినా మనసు, ఆలోచన, ఆలోచనలలో లయం అయిపోతాయి. వీటిని మనం గురుపూర్ణిమ రోజున గమనించవచ్చు. సరే! ఇక బాబా ఏం చెప్పారు? గురువును పూజ చేసుకొమ్మని చెపుతూ ఒక స్తంభాన్ని చూపారు. నన్ను పూజ చెయ్యి అని చెప్పలా! దానికి కారణం ఏమయ్యా అంటే ఏ గురువు కూడా తనను గురువుగా భావించుకోడు. సరే చెప్పారు. ఎదురుగా ధుని ఉంది కదా, ధునినో, ఇంకోదాన్నో పూజించుకొమ్మని ఎందుకు చెప్పలా! స్తంభాన్నే ఎందుకు పూజించుకొమ్మన్నారు, అంటే – మొత్తం ఈ ఆధ్యాత్మికత అనేదానికి మూలస్థంభం సద్గురువు. ఈ స్తంభం మీదనే మొత్తం ఆధ్యాత్మిక సౌధం కట్టబడి ఉంది. అంటే ఆ కృప లేకపోతే, ఆ పట్టు లేకపోతే మొత్తం కూలిపోతుంది. కనుక మనం స్తంభాన్ని (గురువును) గుర్తించి పూజించాలి. గురువును పూజించాలంటే

మనకి ముందు గురుతత్త్వం ఏమిటో తెలియాలి. ఆ విషయం తెలిస్తే గాని సరిగా పూజ చేసుకోవడం తెలియదు. అది తెలిస్తేనే మనం గురుపూర్ణిమ యొక్క ఫలితాన్ని పూర్తిగా పొందగలం. బాబా కూడా అన్నారు, "గురువును తెలుసుకో! ఎందుకొచ్చినట్లు, పిడకలేరుకోవడానికా" అని.

ఎంత గొప్పగా ఉన్నదో ఆ మాట! కాబట్టి మొదట మనం గురువును తెలుసుకోవాలి. (గురుతత్త్వం అంటే ఏమిటో తెలుసుకోవాలి). నాకు గురువు యొక్క అనుగ్రహం లేదు. గురువు యొక్క కృపలేదు అని మనం అనుకుంటూ ఉంటాం. కానీ **గురుకృప మాత్రం వర్షంలా ధారాపాతంగా ఎప్పుడూ ఉంది.** బయట బాగా వర్షం వచ్చిందనుకోండి, మనం ఇంట్లో కూర్చొని ఉంటే తడవం. **గురుకృప అనే వర్షం వర్షిస్తుంది.** మన యొక్క అహంకారం, మమకారం, కోరికలలాంటి ఇంట్లోకి పోయి కూర్చుంటే మనం తడవం. కానీ, కిటికీలు, తలుపులు, తీసిపెట్టుకు కూర్చుంటే కొంచెం అయినా చల్లదనం వస్తుంది. అసలు తలుపులు మూసేసామనుకోండి; బయట వర్షం వస్తున్నట్లు కూడా తెలియదు. మనం కనీసం కిటికీలు తీసి పెట్టుకొని ఉన్నాం, బయటకు మాత్రం పోవడం లేదు. గురువు అనేటటువంటి వారు కష్టాలనే వర్షాల నుండి కాపాడే (రక్షించే) గొడుగులాంటి వారు అనుకుందాం. ఉదాహరణకి గొడుగు మనల్ని వర్షం నుండి తడవకుండా కాపాడుతుంది. ఎట్లా కాపాడుతుంది? మూలనుండే గొడుగును తీసి దులిపి, దాన్ని తీసి సరిగా పెట్టుకుని, జల్లు ఎటు నుంచి కురుస్తుందో దానికి వాటంగా గొడుగును పట్టుకోగలగాలి. వర్షం వచ్చేటపుడు గొడుగును చేతిలో పట్టుకున్నా, చంకలో పెట్టుకున్నా ఆ గొడుగు మనల్ని కాపాడుతుందా? లేదు! మూలన పెట్టుకున్నాం, వర్షం రాగానే గొడుగు టింగ్‌టింగ్ మని నెత్తిమీదకొచ్చి మనల్ని కాపాడుతుందా? గొడుగును గొడుగులా ఉపయోగపెట్టుకుంటే అది గొడుగవుతుంది. లేకపోతే అది చేతి కర్ర అవుతుంది. అదీ కాకపోతే మూలనుండే ఒక పిచ్చి కర్ర అవుతుంది. చేతి కర్రలాంటి వాడు గురువు. మనం సరిగా నడవలేం, మనలను నడిపించేవాడు గురువు. చేతి కర్ర మూలనుంటే మనం నడవగలమా? చేతి కర్రను పట్టుకొని ఏ రకంగా అయితే మనం సరిగా నడవగలమో, ఆ రకంగా నడవడానికి మనం గురువును ఉపయోగపెట్టుకోవాలి! ఇది మనవైపు నుండి మనం చేయవలసింది. కానీ జరిగేది మాత్రం ఏమిటంటే ఆయన కృపే మనల్ని అటు నడిపిస్తుంది. అది మామూలుగా ఉండే సంప్రదాయాల్లో సత్యం. మనం పట్టుకుంటే తప్పించి నడవలేం అనేది. కానీ బాబా విషయంలో మాత్రం అట్లా కాదు. ఎందుకంటే ఆయన మన మీద అసలు ఏమీ పెట్ట లేదు! ఫలానాది చెయ్యి, ఇది చేస్తే నేను ఇది చేస్తా అని కూడా ఏమీ చెప్పలా!





ఆయన సంకల్పం లేకుండా సాయిభక్తులం కాలేం. శిరిడీకి రాలేం. ఆయన స్మరణ చేయలేం. మనం చేయవలసినది ఏమిటి అని అంటే ఆయన యొక్క కృపను గుర్తించడం, గుర్తిస్తే మనకు ఆనందం, గుర్తించకపోతే ఆనందంగా మనం ఉండలేం. ఎవరో మనకు తెలియకుండా మన ఎకౌంట్‌లో లక్ష రూపాయలు వేసారు. మనకు తెలియదు, మన ఎకౌంట్‌లో లక్ష రూపాయలు ఉంది. మనకయితే ఆ విషయం తెలియదు, ఎవరో ఇది చేసి పోయినారు, వీడికేమో ఇంట్లో జరుగుబాటు కష్టంగా ఉంది. ఆ రోజు ఆ క్షణం వరకు దరిద్రుడే! అకౌంట్‌లో డబ్బు ఉందని తెలుసుకున్నాడో, ఆ క్షణం నుంచి లక్షాధికారి అయిపోయాడు. అంతకుముందు వాడేమన్నా భిక్షాధికారా అంటే, వాడి అకౌంట్‌లో డబ్బు ఉందే! అట్లాగే బాబా యొక్క కృప మన మీద వర్షిస్తోంది. రకరకాల పరిస్థితుల రూపంలో, రకరకాల సంఘటనల రూపంలో మనకు చూపిస్తూనే ఉన్నారు. కానీ మనం దాన్ని గుర్తించడంలా! గుర్తిస్తే మన మనసు కృతజ్ఞతాభావంతో నిండిపోతుంది. ఇంకా ఇంకా ప్రోత్సాహకరంగా మనం ముందుకు పోగలం. మనం చేయవలసినదంతా ఏమిటంటే, మన జీవితంలో జరిగే వివిధ సంఘటనలు ఎట్లా ఏ కూర్పుతో వస్తున్నాయి, దీంట్లో సాయికృప ఎట్లా వ్యక్తమవుతుంది, అనేది మనం గుర్తించడమే! జరిగే సంఘటనను సాయికృప ద్వారానే అని ఎట్లా తెలుసుకోవడం? కార్యకారణంగా జరిగే సంఘటనలను మనం బాబా కృప అనుకుంటున్నామేమో! మనల్ని మనం మోసం చేసుకుంటున్నామేమో! అని కూడా అన్పించవచ్చు, కొంత మందికి. అలా సద్గురు అనుగ్రహాన్ని గుర్తింపులో ఉంచుకొని, కృతజ్ఞతతో మనం చేయవలసిన పని సమయాన్ని సద్వినియోగం చేసుకోవడమే! వ్యర్థ సంభాషణలలో, పరనిందా ప్రసంగాలలో మనం పాల్గొనకుండా ఉండడమే! శిరిడీ వచ్చి పరనిందా ప్రసంగాలలో పాల్గొనే వ్యక్తిని పంది అశుద్ధాన్ని తినటంతో బాబా పోల్చినతీరు చరిత్రలో చూసాం! మనకు గానీ, ఎదుటివారికి గానీ, ఆ స్థలంలో లేని మూడవ వారికి గానీ ఉపయోగం లేని మాటలను మాట్లాడకుండా ఉండడం, ఉపయోగం అంటే నేను అది ఆధ్యాత్మికమైనదని చెప్పడంలా ప్రాపంచికమైనదైనా సరే, మనకన్నా, ఎదుటివానికన్నా, అక్కడలేని మూడో వ్యక్తికన్నా ఉపయోగం ఉండాల!

**సద్గురు స్మరణలో జీవితాన్ని గడుపుదాం - ఇహపర శ్రేయోదాయకమైన సద్గురు పథంలో సాగుతూ గురువనే గమ్యాన్ని గురుఅనుగ్రహంతో చేరదాం.**

**తమతమ అనుభవాలను తోటి వారితో పంచుకోవడం ద్వారా వారు తమకు తెలియకుండానే సాయి ప్రచారం చేస్తున్నారని చెప్పాలి. ఈ దృష్ట్యా ప్రతీ సాయిభక్తుడు ఒక సాయిసేవకుడే, ఒక సాయితత్త్వప్రచారకుడే! కానీ ఇక్కడ జరిగేది పంచుకోవడమే గానీ, పెంచుకోవడమనే ప్రచార కార్యం కాదు.**

# అనుగ్రహమే అసలు సంపాదన

- సుప్రజ

నా పేరు సుప్రజ. మాది సంతనూతలపాడు. నేను 1999 నుండి సత్సంగానికి వెళ్తున్నాను. సత్సంగానికి వచ్చిన మొదటి రోజులలో నాకు గురువుగారి గురించి తెలిసేది కాదు. ప్రతి వారం ఎవరో ఒకరు వచ్చి బాబా గురించి, గురువుగారి గురించి చెపుతుండేవాళ్లు. వారి సత్సంగాల ద్వారా గురువుగారి గురించి తెలుసుకున్నాను. ఒంగోలులో గురువుగారు స్థాపించిన స్కూల్ ఉంది. ఆ స్కూల్‌లో ఉద్యోగం చేయాలని ఎంతో ఆశగా ఉండేది. ఒకరోజు సుబ్రహ్మణ్యం సార్ వచ్చినపుడు గురువుగారి స్కూల్‌లో వర్క్ చేసుకుంటామని అడిగాము. అది మన స్కూల్, ఎవరైనా వర్క్ చేసుకోవచ్చుని చెప్పారు. గురువుగారి అనుమతి వచ్చింది. కాని నేను అప్పుడు డిగ్రీ చివరి సంవత్సరం చదువుచున్నాను, కాలేజీకి వెళ్లాలి. కాలేజీకి వెళుతూ స్కూల్‌లో వర్క్ చేయడం ఎలా కుదురుతుంది? కాని గురువుగారి అనుగ్రహం వల్ల కాలేజీకి ఆఫ్‌డే వెళ్తూ మధ్యాహ్నం నుండి స్కూల్‌కి వెళ్లి వర్క్ చేసుకునేదాన్ని. అలా ఆఫ్‌డే కాలేజీకి వెళ్తుండే మమ్మల్ని టీచర్స్ కూడా ఏమీ అనేవాళ్లు కాదు. అలా కాలేజీకి వెళుతూ గురువుగారి స్కూల్‌లో వర్క్ చేసుకుంటూ ఆ సంవత్సరం ముగిసింది. చివరి సంవత్సరం పరీక్షలు కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా వ్రాసాము. ఎంతో కష్టంగా వస్తాయనుకున్న పేపర్స్ కూడా సులువుగా వచ్చాయి. ఇదంతా గురువుగారి అనుగ్రహమే.

తరువాత సంవత్సరం అనగా 2000లో విజయదశమికి శిరిడీ వెళ్లడానికి అందరూ ప్రయత్నాలు చేస్తున్నారు. నాకు శిరిడీ వెళ్లాలని గురువుగారిని చూడాలని ఎంతో ఆశగా ఉంది. కాని శిరిడీ వెళ్లడానికి డబ్బులు కావాలి. ఆ డబ్బులు తల్లిదండ్రులను అడగడం నాకు ఇష్టం లేదు. స్వయంగా నేను సంపాదించిన డబ్బులతోనే శిరిడీ వెళ్లాలని నా కోరిక. కాని నేను ఎలా సంపాదించగలను? నాకు ఎవరు జాబ్ ఇస్తారు? డిగ్రీ చదివిన వాళ్లకు అసలు జాబ్ వస్తుందా? కాని నాకు వచ్చింది. ఎలా? గురువుగారి ఆశీస్సులతో, గురువుగారి అనుగ్రహంతో. ఎలాగంటే ఆ సంవత్సరంలో గురువుగారి స్కూల్‌లో నేను టీచర్‌గా నియమింపబడటం, గురువుగారు ఇచ్చిన డబ్బులతోనే శిరిడీ వెళ్లడం. బాబాను చూడడం, ఇదంతా తలచుకుంటే ఎంతో ఆనందంగా ఉంది. అప్పుడు అనిపించింది, ఆ రోజు స్కూల్‌లో చేసిన వర్క్‌కు గురువుగారిచ్చిన ప్రతిఫలం ఇదని. ఇలా గురువుగారి అనుగ్రహం ఎల్లప్పుడూ మనందరి మీద కుండపోతగా వర్షించాలని కోరుకుంటూ... మరోసారి నా ఆనందాన్ని అనుభవంగా మీతో పంచుకుంటాను.






సాయిచెంతకు చేరడానికి నాటి చోల్కర్ ఆలోచనా రీతిని సాయి చరిత్ర చదివిన ఎవరూ కూడా మరువలేరు. నాడు సాయి అనుగ్రహంతో చోల్కర్ అందరకూ కలకండ పంచాడు. నేడు శిరిడీ చేరడానికి అయ్యే ఖర్చు తన సంపాదన అయితే బాగుంటుందని భావించిన సుప్రజకు గురువుగారు డబ్బివ్వడం మరచిపోలేని ఒక మధురానుభూతి. విషయానికొస్తే సుప్రజ సంపాదించి రూకలనేకంటే అనుగ్రహమనే పూరేకులంటే బాగుంటుందేమో!

## తీర్చిదిద్దుట

– సుబ్బారెడ్డి

పూజ్య గురుదేవుల పాద పద్మములకు సాష్టాంగ నమస్కారములతో.. నా పేరు సుబ్బారెడ్డి. నేను ఫిబ్రవరిలో తిరువణ్ణామలై వెళ్లినపుడు నాకు గురువుగారు ఒక అద్భుతమైన అనుభవాన్ని ఇచ్చారు. గురుదేవులు ప్రసాదించిన ఈ ఆనందాన్ని అందరితో పంచుకుంటూ... నేను ఫిబ్రవరి 23 శనివారం నాడు గురువుగారి దర్శనం చేసుకొనుటకు తిరువణ్ణామలై వెళ్లాను. ఆ రోజు గురువుగారిని సంతృప్తిగా దర్శనం చేసుకున్నాను. గురువుగారి దర్శనం నాలో చాలా సంతోషాన్ని కలిగించింది. నాకు ఆ రోజు గురువుగారి దర్శనం తర్వాత గిరి ప్రదక్షిణ చేయాలని ఉన్నా బాగా అలసిపోయి ఉండడంతో రూమ్‌కి వెళ్లి పడుకొని ఉదయాన్నే మూడు గంటలకు లేచి గిరి ప్రదక్షిణ చేద్దామని నిర్ణయించుకున్నాను. కాని నేను నిద్ర లేచేసరికి ఆరు గంటలు అయినది. నా పొరపాటు ఆలోచనలు, నిర్ణయాలకు నా మీద నాకు అసహ్యం వేసింది. మరునాడు ఆదివారం రోజున గురువుగారికి ఒక మెయిల్ చేసాను. ఆ మెయిల్‌లో గురువుగారు నాకు గిరిప్రదక్షిణ చేయాలని ఉంది, కానీ ఇప్పటి వరకు గిరిప్రదక్షిణ చేయలేదు. నన్ను గిరిప్రదక్షిణకు తీసుకువెళ్లే ఒక తోడును చూపించండి అని విన్నవించుకున్నాను. నేను గురువుగారికి మెయిల్ ఇచ్చానే కానీ, తరువాత నేను గురువుగారిని అడిగిన విషయం పూర్తిగా మరచిపోయాను. ఆదివారం సాయంత్రం మేము గురువుగారి దర్శనం కోసం 'హరితాచల'కు వెళ్లాము. ఆ రోజు కూడా గురువుగారిని తృప్తిగా దర్శనం చేసుకున్నాను. ఆరోజు దర్శన సమయంలో నా విన్నపాలకు గురువుగారి స్పందన నాకు చాలా సంతోషాన్ని కలిగించింది. నేను, జగదీష్, రాజు రెండు రోజులు తిరువణ్ణామలైలో ఉందామని వచ్చాము. అందువలన మేము ఆ రోజు బయలుదేరవలసి ఉంది. కానీ, నాకు మాత్రం ఇంకొక రోజు తిరువణ్ణామలైలోనే ఉండాలనే కోరిక ఉన్నా, చివరకు గిరి ప్రదక్షిణ చేయకుండానే ఆ రోజే బయలుదేరేందుకు సిద్ధం అయ్యాను. నా ప్రణాళిక ఈ విధంగా ఉంటే గురువుగారి ప్రణాళిక మరొక విధంగా ఉంది. నా కోరికను గురువుగారు ఆ రోజే

తీర్చడానికి అన్ని ఏర్పాట్లు చేసారు. అనుకోకుండా ఏదో పని కారణంగా నరేంద్రగారితో కలసి జగదీష్ హరితాచల నుండి గురువుగారు విడిది చేసిన గృహం వరకు కారులో వెళ్లవలసి వచ్చింది. ఆ సమయంలో నరేంద్రగారు జగదీష్‌ను ఎప్పుడు, ఎలా వెళుతున్నారు? అని ప్రశ్నించగా జగదీష్ ఆ రోజే రాత్రికి కారులో బయలుదేరుతున్నామని చెప్పగా నరేంద్రగారు రాత్రిపూట ప్రయాణం వద్దు! రేపు ఉదయం బయలుదేరండి అని చెప్పడంతో ఆ రోజు మా ప్రయాణం వాయిదా పడింది. అందువలన ఆ రోజు రాత్రి గిరి ప్రదక్షిణ చేయాలని అనుకున్నాము. నేను గిరి ప్రదక్షిణ చేయడానికి బయలుదేరి గురువుగారు ఉంటున్న ఇంటి దగ్గరకు వెళ్లాను. అప్పుడు అక్కడ ఒంగోలు డా॥ శ్రీనివాసులరెడ్డి గారు ఉన్నారు. తెల్లవారుఝామున మూడు గంటలకు గిరిప్రదక్షిణ చేయాలనుకున్న ఆయన, మమ్మల్ని చూసి తన నిర్ణయం మార్చుకొని మాతో కలసి గిరిప్రదక్షిణకు బయలుదేరారు. మేము గిరిప్రదక్షిణ పూర్తి చేసి వచ్చేసరికి ఉదయం గం॥5.30ని॥లు అయ్యింది. గిరిప్రదక్షిణ చేస్తున్నంతసేపు ఆయన సత్సంగము చేసారు. ప్రదక్షిణ పూర్తి అయ్యే వరకు మేము బాబా స్మరణలోనే ఉన్నాము. నాకు గిరి ప్రదక్షిణకు ఒక తోడును చూపించండి, అని అడుగగా శ్రీనివాసులరెడ్డి గారిని నాకు తోడుగా పంపించిన గురువుగారికి మనస్పూర్తిగా పాదాభివందనం చేసుకుంటున్నాను. ఇక్కడ ఈ అనుభవం ద్వారా నేను తెలుసుకున్న విషయం ఏమిటంటే, మనం మన కోరికను ఒకసారి గురువుగారికి నివేదించుకున్న తరువాత మనం దాన్ని గూర్చి మరచిపోయినా గురువుగారు దానిని మరువక మన కోరికను తీర్చేందుకై కావలసిన పరిస్థితులను ఏర్పాటు చేసి మన కోరికను తీరుస్తారు. ఇది నేను అనుభవపూర్వకముగా తెలుసుకున్న సత్యం. సద్గురు లీలలు ఆలోచనకందేవి కావు. వారి యొక్క ప్రణాళిక ఎట్లా ఉండునో మనవంటి వారికి ఊహకు కూడా అందవు. కాకాజీ వైద్యను శిరిడీకి రప్పించేందుకు శ్యామా మొక్కును తీర్చిన వైనం – సద్గురు ప్రణాళికా పథంలో ఒక కోణం. బిడ్డల అవసరాలు, వాటి వాటికి తగినట్లు అన్నీ అమరడం, శ్రేయస్సుకై ఆయన చేసే ఏర్పాట్లు ఇలా ఆయన 'భక్తులు అడిగినవన్నీ ఇస్తూనే ఉంటారు' బాబా కేవలం మన కోరికలు తీర్చడం మాత్రమే కాదు, వాటిని ఒక క్రమంలో, చక్కటి సంఘటనల కూర్పుతో మనకు అందించి, మన అంతరంగం వాటి వల్ల సరైన పంథాలో ప్రభావితమయ్యేట్లు చూస్తారు. కోర్కెలను తీర్చుటలో లేదు నిదానము! కోర్కెలను 'తీర్చి–దిద్దుట'యే శ్రీ సాయి విధానము.



**గురుబంధువుల తమ అనుభవాలను గురుకృప అడ్రస్‌కు గాని, లేదా gurukrupa@saimail.com కు పంపగలరు.**



# నా వెంట తానుంటే - గోపవరపు రత్నమాల

నాపేరు గోపవరపు రత్నమాల. నేను నూతన సంవత్సరం 2000కి మా నాన్నగారితో కలసి శిరిడీకి వెళ్లాను. అక్కడ నుండి జనవరి 3న గురువుగారి చేతుల మీదుగా జరిగే బాబా మందిర ప్రారంభోత్సవం, బాబా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు వెళ్లడం జరిగింది. అక్కడ గురువుగారి దర్శనం అంతా బాగా జరిగింది. ఒక వారం తరువాత మేము ఇంటికి వచ్చేసాము. నాకు ఎప్పుడు మొదలయ్యిందో తెలియదు కాని బాగా వెన్ను నొప్పి వచ్చింది. బాబా మందిర ప్రారంభోత్సవానికి వెళ్లేటపుడు, వచ్చేటపుడు ఆ రూటు సరిగా లేనందున అందరూ చాలా ఇబ్బంది పడ్డారు. మా ఊరు వచ్చిన తరువాత కూడా నాకు నొప్పి తగ్గలేదు. అమ్మ, నాన్నలకు చెప్పాలంటే భయం. ఎందుకంటే నాకు ఏదైనా సమస్య వస్తే నాకంటే వాళ్లే ఎక్కువ బాధ పడతారు. నా పరిస్థితి చాలా ఇబ్బందికరంగా తయారయ్యింది. నొప్పి బాగా ఎక్కువయ్యింది. కనీసం అరగంట కూడా కూర్చోలేని స్థితి. ఇది నేను డిగ్రీ చివరి సంవత్సరం చదువుతుండగా జరిగింది. ఆ పరిస్థితిలో నేను మార్చిలో జరిగే చివరి పరీక్షలు వ్రాయలేనేమో అనుకున్నాను. జనవరిలో ప్రారంభమైన నొప్పి తగ్గకపోవడంతో ఫిబ్రవరిలో డాక్టర్ దగ్గరకు వెళ్లాను. కాని నన్ను పరీక్షించిన డాక్టర్‌కు నాకు ఎందుకు నొప్పి వస్తోందో అర్థం కాలేదు. నన్ను పరీక్షించిన డాక్టర్ గారు నాకు కొన్ని రకాల మందులు ఇచ్చి, నాకు బాగా విశ్రాంతి అవసరమని, మార్చిలో జరిగే పరీక్షలకు హాజరు కావద్దని చెప్పారు. ఈ విషయంలో ఎటువంటి రిస్క్ తీసుకోవద్దని కూడా హెచ్చరించారు. కాని నేను డాక్టర్‌గారు ఇచ్చిన మందులు వాడుతూ ఫిబ్రవరి, మార్చి రెండు నెలలు ఉంది కదా చదువుకుని చివరి పరీక్షలకు హాజరు కావాలని ప్రతి రోజూ గురువుగారిని ప్రార్థిస్తుండేదాన్ని. గురువుగారూ! నేను డిగ్రీ  చివరి సంవత్సరం పరీక్షలు వ్రాయాలి, ఉత్తీర్ణత సాధించాలి అని రోజూ గురువుగారికి విన్నవించుకుంటూ ఉండేదాన్ని. ప్రతి రోజూ శిరిడీకి ఫోన్ చేసి బాబా, గురువుగారి ఆశీస్సులు తీసుకునేదాన్ని. అందరూ రిస్క్ తీసుకోవద్దని, వచ్చే సంవత్సరం పరీక్షలు వ్రాయవచ్చని  చెప్పినా, నాకు నా గురువు ఆశీస్సులు ఉన్నాయని చెప్పి నేను చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యాను. మాకు మొత్తం ఆరు పరీక్షలు ఉంటాయి. నేను ప్రతీ పరీక్ష ఒక గంటసేపు మాత్రమే కూర్చొనగలిగి, వ్రాసి బయటకు వచ్చేసాను. దాంతో ఫెయిల్ అవుతానేమో అనుకున్నాను. మాకు ఉన్న ఆరు పరీక్షలలో ఆడిటింగ్ ఒకటి. అది మొత్తం థియరీ అయినందున నేను సరిగా చదువలేకపోయాను. ఆ విధంగా నేను పరీక్షలు వ్రాయడం పూర్తి చేసి ఫలితాల కోసం ఎదురుచూసాను.

అందరూ పరీక్షలు అయిన తరువాత సెలవురోజుల్లో ఎంబిఎ, ఎంసిఎ కోచింగ్ తీసుకుంటున్నారు. నేను నా అనారోగ్యం కారణంగా ఎటువంటి కోచింగ్‌కి వెళ్లలేదు. కాని ఎంబిఎ, ఎంసిఎ ప్రవేశ పరీక్ష దరఖాస్తుని ఒకటి తీసుకొని దాచి ఉంచాను. మా పరీక్ష ఫలితాలు తెలిసే రోజు రానే వచ్చింది. నేను చాలా భయపడ్డాను. బాబా, గురువుగారిని అర్థిస్తూ ఏడవడం మొదలుపెట్టాను. బాబా, గురువుగారు నన్ను అనుగ్రహించారు. ఆశ్చర్యంగా నేను డిగ్రీ ఉత్తీర్ణురాలయ్యాను. నాకు అప్పుడు ఎంబిఎ, ఎంసిఎ ప్రవేశ పరీక్షలో కూడా ర్యాంక్ సాధించగలను. నాకు బాబా, గురువుగారు ఇస్తారు అన్న విశ్వాసం కలిగింది. పి.జి. ప్రవేశ పరీక్షకు ముందు నేను మా నాన్నగారితో కలసి శిరిడీకి వెళ్లాను. గురువుగారి దర్శనం కోసం క్యూలో ఉన్నపుడు మా నాన్నగారిని గురువుగారిని ఏమి అడగాలి? అని అడుగగా నీకేం కావాలో అదే అడుగు అని చెప్పారు. నేను మరలా అడుగగా ఇప్పుడు అందరూ కంప్యూటర్ కోర్సులే చేస్తున్నారు కదా ఎంసిఏ మంచిదని నా అభిప్రాయం. అని చెప్పారు. నేను గురువుగారితో "గురువుగారూ! నాకు ఎంబిఎ చేయాలని ఉంది. కాని నాన్నగారికి ఎంసిఎ చేయించాలని ఉంది. నాకు ఏది ఇస్తారో మీ ఇష్టం" అని చెప్పాను. కొన్ని రోజుల తరువాత పి.జి. ప్రవేశ పరీక్షలు వచ్చాయి. నాకు గురుదేవుల ఆశీస్సులతో ఎంబిఎ, ఎంసిఎ రెండింటిలో కూడా సీటు వచ్చింది. నేను ఎంబిఏలో చేరి విజయవంతంగా నా ఎంబిఎ పూర్తి చేసాను. మా కుటుంబ సభ్యులందరికీ గురువుగారు ఒంగోలులో ఉన్నప్పటి నుండి తెలుసు. మేము అందరం చాలా సంతోషంగా ఉన్నాము. ఈ ఆనందం కేవలం బాబా గురుదేవుల అనుగ్రహం.

అనుగ్రహమే అంతటా అలరారుతుంటే మాకింక ఎందుకు మనసంత చింత, మీ రూప చింతనే మాకు ధ్యానంబు, మీ నామస్మరణమే మాకు శరణమ్ము అంటూ సాగిన చి॥ రత్నమాల అనుభవం సద్గురు శక్తి మత్వానికి ఒక చక్కటి సోదాహరణం. వారు అనుగ్రహించదలిస్తే ఆరోగ్యము, ఐశ్వర్యము, తలరాత, ఇలాంటివన్నీ కేవలం నామమాత్రాలు, పుక్కిటి పురాణాలు. మూకం కరోతి వాచాలం... అన్నట్లు మూగవానిచే మాట్లాడించగలరు, ఎలాంటి శారీరక రుగ్మతనైనా తొలగించి, మానసికంగా బిడ్డకు స్థైర్యాన్నిచ్చి, శ్రేయోదాయకమైన సాయి అనుగ్రహపథంలో విజేతగా మలచగలరు.



**కులాల కుళ్లు - మానవత్వపు ముళ్లు**

తిలకం ధరించి రైలులో ప్రయాణం చేస్తున్న ఒక వ్యాపారి భోజనం చేసేందుకు సిద్ధమవుతూ తన ముందు ఖద్దరు దుస్తులలో ఉన్న ఒక నాయకుడిని చూసాడు. ! "మహాశయా! మీది ఏ కులం?" అని ప్రశ్నించాడు. "ఏదైనా కులానికి చెందినవాడినైతే కదా! నా కులం చెప్పడానికి" అన్నాడు ఖద్దరు ధరించిన వ్యక్తి. వ్యాపారి అదే ప్రశ్నను పదే పదే అడగసాగాడు. అప్పుడు ఆ వ్యక్తి ఉద్రేక పడకుండా ఇలా అన్నాడు. "ఉదయం ఇల్లు, దొడ్డి శుభ్రం చేసుకునేటప్పుడు నేను పాకీ వాడిని. చెప్పులు శుభ్రం చేసుకునేటపుడు చర్మకారుడిని. బట్టలు ఉతికేటపుడు చాకలిని. డబ్బు లెక్క చూసుకునేటపుడు కోమటిని. కాలేజీలో పాఠం చెప్పేటపుడు బ్రాహ్మణుడిని. అన్యాయాన్ని ఎదిరించేటపుడు క్షత్రియుడిని. ఇప్పుడు నా కులమేదో మీరే నిర్ణయించండి.

– జె.బి.కృపలానీ

# చింత-నిశ్చింత

- రామచంద్రరావు




నా పేరు టి. రామచంద్రరావు, మాది తెనాలి. నేను 1996లో తెనాలిలో కృష్ణ మాస్టర్ నిర్వర్తిస్తున్నటువంటి సత్సంగానికి గురుబంధువు నారెళ్ల సుబ్బారావుగారి ప్రోద్భలంతో వెళ్లాను. అప్పటి నుండి అక్కడ జరిగే సత్సంగ కార్యక్రమాలలో మరియు ప్రతి ఆదివారం ఇతర గ్రామాలలో  జరిగే నగర సంకీర్తన కార్యక్రమాలలో పాల్గొంటున్నాను. వివిధ సందర్భాలలో బాబా, గురువుగారు నాకు అనేక అనుభవాలనిచ్చారు. ఇప్పటివరకు ఎన్నో అనుభవాలు జరిగినా నేను పంచుకుంటున్న ఈ అనుభవం మాత్రం ఎప్పటికీ నా జీవితంలో మరపురాని మైలురాయి వంటిది. 16.08.07న మా అబ్బాయి పవన్‌కి జ్వరం వచ్చింది. వాంతులు, విరోచనాలు మొదలైనవి. బాగా నీరసంగా ఉండడంతో తెనాలిలో వైద్యం చేయించాము. రెండు రోజులైనా జ్వరం తగ్గకపోవడంతో మా అబ్బాయి కోరిక మేరకు గుంటూరు హనుమంతరావుగారి ఆసుపత్రిలో చేర్పించాము. 18.8.07న సెలైన్, ఇంజక్షన్లు ఇచ్చారు. ఫరవాలేదు, జ్వరం తగ్గింది అన్నారు. నేను రాత్రి 10.30కి ఫోన్ చేయగా మా అబ్బాయి భోజనం చేసాను. వాంతులు, విరోచనాలు తగ్గినవి, ఇప్పుడు ఆరోగ్యంగానే ఉన్నాను నాన్నా! అని చెప్పాడు. మా అబ్బాయిని గుంటూరు పంపించడం  నాకు, నా భార్యకు ఇష్టం లేకపోయినా పంపించాము. కాని అది బాబా, గురువుగారి ప్రేరణ అని అర్థం అయింది. 18.8.07 రాత్రి పవన్‌కి రక్తంతో కూడిన పెద్ద వాంతి అయ్యింది. నా భార్య కంగారుపడి నర్సుని పిలవగా ఆమె కూడా ఆ వాంతి చూసి భయపడి వెంటనే డాక్టర్‌గారి ఇంటికి ఫోన్ చేసి చెప్పింది. డాక్టర్ గారు వెంటనే వచ్చి మా అబ్బాయి పరిస్థితి చూసి వెంటనే నా భార్యతో కొత్తపేటలోని అమరావతి ఆసుపత్రికి తీసుకెళ్లండి. నేను వారికి ఫోన్ చేసి చెప్తాను అన్నారు. అమరావతి ఆసుపత్రిలో అడ్వాన్స్ కట్టనిదే పేషెంట్‌ని చేర్చుకోరు. మా డాక్టర్ ఫోన్ చేయడం వలన నా భార్య పవన్‌ని మా బావమరదుల సహాయంతో అమరావతి ఆసుపత్రిలో చేర్పించింది. నాకు రాత్రి 12గం॥లకు ఫోన్ వచ్చింది. పవన్‌కి సీరియస్‌గా ఉంది, బి-పాజిటివ్ రక్తం ఇచ్చేవారు నలుగురు కావాలి, వెంటనే తీసుకుని రండి! అని. నేను మా స్నేహితులకు ఫోన్ చేయగా బాబా అనుగ్రహం వలన ఇద్దరు రక్తం ఇవ్వడానికి వచ్చారు.

19.08.07న 10.30ని॥లకు డాక్టర్ ప్రభాకర్‌గారు నన్ను పిలిచి పవన్‌కి రక్తంలో తెల్లరక్తకణాలు లేవు. అవి పెరగాలంటే ట్రీట్‌మెంట్ రోజుకి రూ.10,000/- అవుతుంది. 10 రోజులు ట్రీట్ మెంట్ చేయాలి భరించగలరా?  అని అడిగారు. నేను భరించలేను. వేరే మార్గం చెప్పండి. అని అడుగగా

"పేషెంట్‌ని ఇంటికి తీసుకొని వెళ్లడమే" అన్నారు. చేసేది లేక నేను డాక్టర్ గారితో, "మీ ప్రయత్నం మీరు చేయండి. నా తిప్పలు నేను పడతాను" అని చెప్పి, బయటకు వచ్చాను. మా కుటుంబ సభ్యులందరూ "డాక్టర్ ఏమి చెప్పారు?" అని అడుగగా " ఒక వారంలో తగ్గిపోతుందిలే అన్నారు" అని చెప్పాను. కానీ అంత డబ్బు భరించలేని కారణంగా ఏం చేయాలో తోచక దు:ఖం ఆగలేదు. ఆ రోజు ఆదివారం. షాపులు అన్నీ మూసి ఉండడంతో ఒక షాపు ముందు అరుగుమీద కూర్చొని సుమారు 40ని౹౹ ఏడ్చాను. కొంత భారం తీరింది. అప్పుడు మన గురుబంధువు గట్టా రత్తయ్యగారు తిరువణ్ణామలైలో ఉన్న విషయం గుర్తుకు వచ్చింది. ఏదో తెలియని ఆనందం, ధైర్యంతో రత్తయ్యగారికి ఫోన్ చేసి పవన్ గురించి చెప్పి నరేంద్రగారి ద్వారా గురువుగారికి తెలియచేయమని చెప్పాను. "నరేంద్రగారికి ఈరోజే ఎలాగైనా చెప్తాను" అని రత్తయ్యగారు చెప్పారు. నా బాధనంతా బాబా, గురువుగారికి మనసులోనే కన్నీళ్లతో చెప్పుకున్నాను. 19.08.07 మధ్యాహ్నం 1.30 గం౹౹లకు రత్తయ్యగారు నరేంద్రగారిని కలిసి పవన్ గురించి చెప్పారు. నరేంద్రగారు గురువుగారికి తెలిపి రత్తయ్యగారి వద్దకు వచ్చి "గురువుగారికి విషయం చెప్పాను" అన్నారు. రత్తయ్యగారు నాకు 3గం౹౹లకు ఫోన్ చేసి "పవన్ గురించి గురువుగారికి నరేంద్రగారు చెప్పారు" అన్నారు. నేను "ఎన్ని గంటలకు చెప్పారు?" అని అడుగగా 1.30గం౹౹లకు చెప్పానన్నారు.

గురువుగారికి వార్త అందిన తరువాత పవన్ విషయంలో రెండు మార్పులు జరిగాయి. అప్పటి వరకు బి-పాజిటివ్ బ్లడ్ ఇచ్చేవారు వస్తేనే బి-పాజిటివ్ బ్లడ్ ఇస్తాము అన్న బ్లడ్ బ్యాంక్ వారు - వారే పిలిచి ఏ గ్రూపువారైనా పరవాలేదు బి-పాజిటివ్ రక్తం ఇస్తాము అని చెప్పారు. పవన్‌కి ఆరోజు ఉదయం వరకు విరోచనం నలుపురంగులో అవుతోంది. డాక్టర్‌గారు విరోచనం మామూలు రంగుకు వస్తే ఆరోగ్యం కొంత బాగుంటుంది అని చెప్పారు. ఆరోజు గం౹౹2.30-గం౹౹3.00 మధ్యలో విరోచనం మామూలు రంగులో అయింది. నేను వెంటనే రత్తయ్యగారికి ఫోన్ చేసి ఈ రెండు విషయాలు గురువుగారికి తెలియచేయమన్నాను. నా మిత్రులు వాసుగారు రక్తంలో తెల్లరక్తకణాలు రెండు రకాలుగా ఉంటాయి. మామూలు వ్యక్తుల రక్తంలో అయితే మూడు నుండి ఐదు వేల వరకు తెల్లరక్తకణాలు పెరుగుతాయి. వయసులో ఉండి ఎటువంటి అలవాట్లు లేని పిల్లలు అయితే ఐదు నుండి యాభైవేల వరకు పెరుగుతాయి అది మీ అదృష్టం మీద ఆధారపడి ఉంది అన్నారు. 20.8.07న మా అబ్బాయికి మంగళగిరి ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో ఇద్దరు దోనర్ల సహాయంతో తీసుకున్న నాలుగు బ్లడ్ ప్యాకెట్స్ లో ముందు రెండు ప్యాకెట్లు, మరునాడు





ఒక ప్యాకెట్ రక్తం ఎక్కించారు. 22.08.07 న పవన్‌కి రక్త పరీక్ష చేసిన డాక్టర్లు చెప్పిన విషయం విన్న తరువాత మా ఆశ్చర్య ఆనందాలకు అవధులు లేవు. అది ఏమిటంటే మా అబ్బాయికి పెరగవలసిన కణాలు 1,60,000 కాగా 1,80,000 పెరిగినవి. మొదట డాక్టర్ చెప్పిన ప్రకారం అయితే సుమారు 100 పాకెట్ల రక్తం ఎక్కించాలి. కాని బాబా అనుగ్రహం, గురుదేవుల ఆశీస్సులతో మొత్తం 7 ప్యాకెట్ల రక్తంతో రోగ నివారణ చేసి నా కుమారునికి పునర్జన్మను ప్రసాదించి మా కుటుంబానికి మాటలతో చెప్పలేని ఆనందాన్ని ప్రసాదించిన బాబా గురుదేవుల పాదములకు మా కుటుంబసభ్యులందరం పాదాభివందనం చేసుకుంటున్నాము. గురువుగారు నాకు అన్ని విధాలా సహాయం చేసారు. నాకు ఉన్న డబ్బు సమస్యను మిత్రులు, శ్రేయోభిలాషుల ద్వారా తీర్చారు. మరొక ముఖ్య విషయం ఏమిటంటే అమరావతి ఆసుపత్రిలో తెల్లరక్తకణాలు తగ్గిన పేషెంట్‌ల తరపువారు మాకు చెప్పిన విషయం ఏమంటే – వారి తరపు పేషెంట్లు 20 రోజులు కొందరు, 40 రోజులు నుండి కొందరు ఆసుపత్రిలోనే ఉన్నారని సుమారు 2 నుండి 4 లక్షల దాకా ఖర్చు పెట్టినా ఇంకా కోలుకోలేదని చెప్పారు. కాని పవన్ మాత్రం బాబా, గురువుగారి ఆశీస్సులతో 7 రోజులలో సుమారు 50,000 ఖర్చుతో ఆసుపత్రి నుండి సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి తిరిగి వచ్చాడు. ఇప్పుడు పవన్ ఇంజనీరింగ్ చదువుతూ సంపూర్ణ ఆరోగ్యంతో సంతోషంగా ఉన్నాడు. ఇదంతా గురుదేవుల అనుగ్రహమే. తల్లి, తండ్రి, తాత, బిడ్డ ఎవరైనా సరే! ఎవరికి చింత ఎదురైనా సరే ఒక్కటే ధైర్యం, ఒక్కటే స్థైర్యం, మనకు దైవంగా సాయి – ఆ దైవానికి మన చింతలను విన్నవించి తొలగించే సద్గురుమూర్తి శ్రీ బాబూజీ. నాడు చరిత్రలో మోరేశ్వర్ ప్రధాన్ తల్లికి బొంబాయిలో పక్షవాతమొచ్చి ఆందోళన పడుతుంటారు కుటుంబసభ్యులంతా! బాబా సన్నిధిలో మోరేశ్వర్ ఉన్నాడు కనుక ఎట్టి ఇబ్బంది రాదని ధైర్యం చెపుతారు నానా! తెల్లవారుఝాముకు మోరేశ్వర్ ఇల్లు చేరి, ఊదీ, తీర్థము ఇవ్వడమూ, ఆమెకు విరోచనమయి గండం గడవడం మనం చూసాం. ఇలా చింతలతో తల్లడిల్లిపోయే జీవులన్నింటికి అభయాన్నిచ్చి నిశ్చింతను ప్రసాదించేదే సద్గురు సన్నిధానం – అది కరుణకు ఉత్కృష్టమైన పెన్నిధానం.

## నా ఆజ్ఞ లేక ఆకైనా కదలదు

– కామేశ్వరరావు

నా పేరు కామేశ్వరరావు. నా ఉద్యోగ రీత్యా నేను కడప వెళ్తుంటాను. నేను ఒకరోజు కడపలో ఉండగా గురుబంధువులు శ్రీకాంత్ మరియు రాజశేఖర్ నాకు ఫోన్ చేసి మన సాయిబాబా సెంట్రల్ స్కూల్ కోసం వెళ్లే నాపరాయిని లోడ్ చేయించడానికి ఎర్రగుంట్ల వెళ్లమని చెప్పారు. రెండు వందల

రాళ్లను లోడ్ చేయించడానికి కాంట్రాక్టర్ డబ్బు తీసుకొని మరుసటి రోజు రమ్మని చెప్పడం జరిగింది. తర్వాత రోజు డబ్బు తీసుకొని వెళ్లి, మధ్యాహ్నం ఒంటి గంటకు లారీ సిద్ధంగా ఉంటుందనడంతో వారంరోజుల క్రితం జరిగిన మాటల ప్రకారం ఆ కాంట్రాక్టర్‌కు రూ. 4500/-లు ఇచ్చి వేచి చూస్తున్నాను. (నిజానికి మనం స్కూల్‌కు తీసుకువెళ్లవలసిన లోడ్ పది టన్నులు, టన్నుకు రూ. 550/- చొప్పున రూ. 5,500/- అవుతుంది) మధ్యాహ్నం 12.30గం॥లకు నాకు డ్రైవర్ ఫోన్ చేసి "నేను పొరపాటున లెక్కపెట్టాను. రూ. 7,000/-లకు తక్కువ ఒంగోలులో లోడ్‌ను దించడం కుదరదన్నాడు". నాకు ఏం చేయాలో తోచలేదు.

రాయి కంపెనీ యజమాని తన ప్రయత్నము తాను చేసాడు. ఫలితం లేదు. అందరూ ఎక్కువ రేటు చెప్తున్నారని తెలిసింది. ఎర్రగుంట్ల నుండి 13 కి॥మీ॥ దూరంలో ఉన్న ప్రొద్దుటూరు నుండి లారీ తెప్పిద్దామని ఆలోచించాను. నాకు తెలిసిన ఒక డిస్ట్రిబ్యూటర్‌కు ఫోన్ చేసి ట్రాన్స్‌పోర్టు ఆఫీసుల ఫోన్ నెంబర్లు అడిగితే వాసవీ ట్రాన్స్‌పోర్టు, ప్రొద్దుటూరు నెంబరు ఇచ్చారు. అక్కడకు ఫోన్ చేస్తే టన్నుకు రూ.550/-లు అవుతుందన్నారు. లారీ ఎప్పటికి పంపించగలరంటే, అరగంటలో లారీ మీ ముందు ఉంటుందన్నాడు. నాకు అర్థం కాలేదు. రెండు రోజులు లేదా కనీసం ఒక్కరోజు ముందైనా చెప్పందే లారీ పంపడం కుదరదు. ఇది విని రాయి కంపెనీ యజమాని కూడా ఆశ్చర్యపోయాడు. 20ని॥లలో నా ముందు లారీ, ఇద్దరు మనుషులు ప్రొద్దుటూరు నుంచి వచ్చేసారు. కొంత సేపయ్యాక ఆ లారీ వాళ్లని అడిగాను. "ఏమిటి మీరు ఒంగోలు వెళ్తుంటే మా బాడుగ వచ్చిందా? అని. కాదు ఈరోజు జరగాల్సిన ఒక లోడింగ్ రద్దు అయ్యింది. వెంటనే బయలు దేరి మీ వద్దకు వచ్చామని" సమాధానం. గురులీలా వినోదమంటే ఇలా ఉంటుంది సరైన ఏర్పాట్లు సకాలంలో జరిగిపోతాయి.

శాసనాలు చేసి శ్రేయస్సును చేకూర్చే కొలువు ఇది. ఈ కొలువులో అన్నీ ఆయన ఏర్పాట్లే, ప్రేమ పూర్వకంగా ఆయన అందించే వనరులను, అవకాశాలను గమనిస్తూ, కేవలం ప్రేక్షకునిలా ఆయన చూపినట్లు, చెప్పినట్లు సాగిపోవడమే మన విధి. బాబాకు జామకాయలు సమర్పిద్దామని అనుకొని, ప్రకృతి పరవశంలో మరచిన లాలా లక్ష్మీచంద్ వద్దకే జామపళ్లు అమ్మే ముసలమ్మ వచ్చి లాలా కొనుక్కున్న జామపండ్లతో పాటు తన దక్షిణను సమర్పించుకోవడం-చారిత్రక వైనం. బిడ్డలు ఒకటి తలిస్తే, బిడ్డల సౌఖ్యాన్ని చూసే సద్గురుమూర్తి ఆ బిడ్డలకు శ్రమ తెలియకుండా అన్ని ఏర్పాట్లు చేసిన పై అనుభవం - సద్గురు సర్వజ్ఞతకు, సర్వసమర్థతకు తార్కాణం.



# అడిగినవన్నీ ఇస్తాను!

– శ్రీకాంతి




నా పేరు శ్రీకాంతి. మా అమ్మ నిర్మలకు బాబా, గురువుగార్లంటే చాలా అభిమానం. మా నాన్నగారు గతించాక మా కుటుంబానికి అమ్మే అన్నీ అయింది. నా పెళ్లి బాధ్యత బాబా, గురూజీలదేనని అమ్మ వారికి విన్నవించేది. అమ్మ తన అనుభవాలను నాతో పంచుకునేది. సాయినామం, పారాయణ, భజన, అనుభవాలు అన్నిటినీ ఆస్వాదిస్తున్న నాకు, అమ్మకు ఒకటే ధైర్యం. బాబా, గురువుగారు ఇద్దరు దగ్గరుండి నా వివాహం చేస్తారని. ఇంతలో మే 29, 2005 సం॥న నా వివాహం సురేష్‌తో నిశ్చయమయింది. తను సింగపూర్‌లో ఉద్యోగం చేస్తారు. మా అన్నయ్య కూడా నాకంటే కేవలం ఒక సంవత్సరమే పెద్దవాడవడంతో నా వివాహం ఎట్లా జరుగుతుందా? అని అందరం ఉత్సుకతతో ఉన్నాము. పెళ్లి అనగానే భోజనాలనుకునే తీరులో జరుగుతున్న ఈ రోజుల్లో మా పెళ్లిని అందరూ కళ్యాణమండపంలో ఉండి వీక్షించి ఆశీర్వదించారు. బాబా, గురూజీ ఇద్దరూ కళ్యాణ మండపంలో ఆసీనులయ్యి మా వివాహం జరిపించారని మాకు అనిపించింది. ఇంత చక్కగా కళ్యాణం జరగడం ఆ కళ్యాణమండపంలో మొదటిసారి చూసామని కొందరు కాంప్లిమెంట్స్ ఇచ్చారు.

నా వివాహ అనంతరం నవంబర్ 2005వ సం॥లో మేము సింగపూర్ వచ్చాము. మరలా డిసెంబర్‌లో సెలవులు ఉండడంతో బోధన్ రావడం, నేను నిజామాబాద్ వార్షికోత్సవానికి వెళ్లడం జరిగింది. అక్కడ గురుబంధువులందరూ పంచుకున్న అనుభవాలు విని, బాబా నాకు కూడా ఇలాంటి అనుభవాలనివ్వాలని అనుకున్నాను. మార్చి 21, 2007వ సం॥ నేను తిరిగి సింగపూర్‌కు వచ్చాను. సింగపూర్‌కు వచ్చాక తెలిసిందేమంటే మావారి క్లైంట్‌కు పని అయిపోవడంతో బెంగుళూరులోని వాళ్ల కంపెనీ వాళ్లు తనను, తన కొలీగ్‌ను నెల రోజుల్లో ఇండియా తిరిగి రమ్మన్నారు. మాకు మాత్రం మరో ఆరునెలలు సింగపూర్‌లోనే ఉండాలని ఉంది. మాకు ఈ మధ్యనే పర్మినెంట్ వీసా రావడంతో పాత కంపెనీకి రాజీనామా చేసి, ఇక్కడే ఉండి మరో ఉద్యోగం కోసం ప్రయత్నించుకునే అవకాశం ఉంది. అయితే పాత కంపెనీ నిబంధనల ప్రకారం ముందుగా తెలుపకుండా రాజీనామా చేస్తే 2,500 డాలర్లు చెల్లించవలసి ఉంటుంది. రెండు నెలల క్రితమే ఇక్కడున్న కంపెనీలలో ఖాళీలన్నీ భర్తీ కావడంతో తిరిగి ఇండియాకు వెళ్లడం తప్ప వేరే మార్గం కనిపించలేదు. మా కోరిక బాబాకు విన్నవించడానికి సింగపూర్‌లో మేమున్న ఓట్రమ్ పార్క్ ప్లేస్‌లో బాబా మందిరం కానీ, బాబా విగ్రహాన్ని కానీ దర్శించలేకపోయాము. అన్నీ సక్రమంగా జరిగి మేము సింగపూర్‌లో స్థిరపడితే బాబా విగ్రహాన్ని ఇక్కడకు తెచ్చుకుందామనిపించింది. ఇలాంటి సమయంలో

నాకు అమ్మ ఎప్పుడూ చెపుతుండే 'నరేంద్రన్న' గుర్తుకు వచ్చారు. అమ్మను నరేంద్రన్నకు ఫోన్ చేసి ఈ విషయం గురించి తెలుపమని అడిగాను. అమ్మ మరియు శ్రీనివాస్‌గారు ఈ విషయం నరేంద్రన్నకు చెప్పడం, నరేంద్రన్న గురువుగారికి చెప్పగా, "వాళ్లకి ఏది మంచిదనిపిస్తే అది చేయమను" అని గురువుగారు చెప్పినట్లు నాకు అమ్మ తెలియచేయడం, నాకు చాలా సంతోషం అనిపించింది.

ఇక సురేష్ ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. సింగపూర్ కంపెనీ అయిన ఎస్.సి.ఎస్. నుండి సురేష్‌కు, తన కొలీగ్‌కు ఇంటర్వ్యూ పిలుపు వచ్చింది. ఇంటర్వ్యూకి వెళ్తున్న సురేష్‌కు బాబా, గురూజీ పాకెట్ ఫొటో ఇచ్చి అధైర్యం అనిపిస్తే వారిని ప్రార్థించుకొమ్మని చెప్పాను. రెండు గంటల తరువాత ఫోన్ చేసి, తన జీవితంలోనే చాలా బాగా చేసిన ఇంటర్వ్యూ అని, తను ఇంటర్వ్యూలాగా కాక ఒక ప్రెజంటేషన్ ఇచ్చిన అనుభవం వచ్చిందని చెప్పారు. వారం గడిచింది. ఇక రెండు రోజుల్లో మేము ఇండియా తిరిగి వెళ్లిపోవాలి. బాబా ముందు కూర్చొని లేచి, సురేష్ ఆఫీస్ నుండి వస్తారని ఎదురు చూస్తున్నాను. తను వచ్చి, ఎస్.సి.ఎస్. కంపెనీ నుంచి ఫోన్ వచ్చిందని, ఇంటర్వ్యూకు వెళ్లిన ఇద్దరిలో ఒకరినే తీసుకున్నారని, అది తానేనని చెప్పడంతో నా ఆనందానికి మేరలేదు. అంతే కాదు పాత కంపెనీ, సురేష్‌కి జీతంతోపాటు బోనస్ కూడా డిపాజిట్ చేయడం, మాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాళ్లకు డబ్బు కూడా ఏర్పాటు చేసారు గురూజీ. గురువుగారి కరుణను చూసి మేము ఎంతో ఆనందించాం. అమ్మ హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సత్సంగం జరిగేచోట నరేంద్రన్నను కలిసి మా ఆనందాన్ని, నమస్కారాలను గురుదేవులకు తెలుపమని వేడుకుంది. వీటన్నిటితో పాటు మాకు ఇక్కడ అక్టోబర్‌లో బాబా మందిరం కూడా రాబోతుంది. ఇలా అంతా ఆనందమే... ఆ సద్గురు సామ్రాట్ చెంత..

'నా భక్తులు అడిగినవన్నీ ఇస్తూనే ఉంటాను! నేను ఇవ్వదలచింది వారు అడిగేంత వరకు అన్న శ్రీ సాయి మాటలు నేడు సమాధి పర్యంతం, వారు తమ భక్తులందరి జీవితాల్లోనూ అనుభవ పూర్వకంగా అందిస్తున్న వైనం జగమెరిగిన సత్యం. నాటి సాయి మాటలను బాటలుగా చేసుకొని ఎవరైతే గురువును సకల ధర్మాత్ముడు అని నమ్మి, సద్గురువును ఆశ్రయించుకున్నారో, ఆ బిడ్డలు ఇక్కడున్నా, సప్త సముద్రాల ఆవలనున్నా వారిని ఆదుకోవడం, అక్కున చేర్చుకోవడం, అడిగినవన్నీ ఇస్తూ ఆనందపథంలో పయనింపచేయడం సద్గురు మాతృత్వం. ఆ మాతృత్వపు మచ్చుతునకే పై అనుభవం.



*అహింస, సత్యము పలకడం, ఇతరులకు దు:ఖము కలిగించే పనులు చేయకుండడము, దమము, దయ ఇవియే తపములని విజ్ఞులు చెప్తారు.*



# ప్రత్యక్ష దైవం

– 'సత్య' సంకలనాలు

తల్లియే బ్రతుకుకు(తొల్లి) మొదలు అని గ్రహించిన సనాతన ధర్మం – 'మాతృదేవోభవ' అని తల్లికి తొలిసారిగా చేతులెత్తి నమస్కరించింది. తల్లి బ్రతుకునిస్తే దానికి సాన పెట్టేవాడు తండ్రి. కనుక తండ్రిని 'పితృదేవోభవ' అని కీర్తించడం జరిగింది. ఎందుకు ఈ జీవితంలోకి వచ్చాం? భగవంతుని తెలుసుకొనేందుకు ప్రాప్తించిన బ్రతుకును భగవన్మయం చేసుకోవాలి. ఈ ప్రయత్నంలో 'గురువు' చుక్కాని అవుతున్నాడు, అంతేగాక బ్రతుకు నావకు నావికుడై శోభిస్తున్నాడు. దీన్ని గుర్తించడమే తెలుసుకోవడం. తరువాత మిగిలేది శరణాగతే. తల్లి, తండ్రి, గురువు, దైవం అని సదా మనం కీర్తిస్తూ ఉంటాము. మరి దైవమేమో అగోచరం, అదృశ్యం. కనిపించే తల్లిదండ్రులు వారే సంసార చక్రంలో పడి ఉన్నందున భగవంతుని చేరే మార్గంలో మనకు సహకరించలేరు. మార్గాన్ని చూపేవారు అందులో ప్రయాణించి ఉంటే చక్కగా వివరించగలరు. ఇక్కడే తల్లిదండ్రులు నిస్సహాయులవుతున్నారు. ఒకరికి మార్గాన్ని చూపేవారు ఆ మార్గం గురించి అవగాహన కలిగినవారై ఉండాలి. జన్మనిచ్చినవారు జన్మను కడతేర్చలేని స్థితిలో ఉండగా జన్మజన్మల ఋణానుబంధం వల్ల, సద్గురుని కరుణానుబంధం వలన లభించిన గురుదేవుడు మనల్ని గమ్యం చేర్చేందుకు మనందరిని తన దరి చేర్చుకుంటున్నారు. గురువు చూపిన మార్గంలో చరిస్తే, మనం (దైవాన్ని) గమ్యాన్ని చేరతాం. కాని గమ్యాన్ని చేరేలోగా గురువే దైవమై (గమ్యమై) ఉంటాడు. సర్వమూ తానైన వాడు సర్వాంతర్యామి అయితే, సర్వమును ఎరిగిన వాడు 'సద్గురువు' కనుకనే "గురువు సాక్షాత్ పరబ్రహ్మమై ఉన్నాడు. కొందరు గురుదేవుని దైవం కన్నా మిన్నగా భావిస్తారు. అది సముచితమే.సాయి వంటి సద్గురు సామ్రాట్టు మనలను గురువుకు పగ్గాలప్పగించి, నిశ్చింతగా కూర్చొనమని చెప్పిన తరువాత, గురువును సకల ధర్మాత్ముడని, గురు చరణాలలోనే జీవిత గమ్యం, లక్ష్యం దాగిఉన్నాయని ఆచరించి చూపాక మనకిక ఆ మార్గమే అనుసరణీయం కదా!

గురువు విషయంలో సంశయానికి అవకాశం లేదు. గురువుని మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం. తనివితీరా దర్శిస్తున్నాం. మనసారా మాట్లాడుకుంటున్నాం. ఆయన ప్రవచించిన దాన్ని పవిత్రంగా శ్రవణ, మననాదులు చేస్తున్నాం. ఆయన కురిపించే ప్రేమలో తడుస్తున్నాం, ఆస్వాదిస్తున్నాం. అందుకే గురుసన్నిధి దైవసన్నిధి కన్నా శ్రేష్ఠమైనదని సాయి ఆచరణపూర్వకంగా చాటారు. వెన్న వున్న చోటే నెయ్యి ఉంది. గురువున్న చోటే దైవం వున్నాడు. వెన్నకు, నెయ్యికి బేధం ఎలానో అవగతమయ్యే వరకు గురువుకు, దైవానికి బేధం అలానే. దీన్ని బట్టి ఒక విషయం స్పష్టంగా అవగతమవుతుంది. గురువు లభిస్తే దైవం లభించినట్లే. "గురువు, దైవం రెండూ ఇద్దరు కాదు. రెండు రూపాలుగా దర్శనమిస్తున్న ఒకే చైతన్య

స్వరూపం.” రెండు ఉన్నాయని చెప్పేందుకు శాస్త్రం లేదు. రెండు ఒక్కటే అని తెలిపేందుకే శాస్త్రం ఉంది. రెండుగా తలచేవారు, దైవం యందు ఎటువంటి భక్తిని ఉంచుతారో, అట్టి భక్తిని గురుదేవుని యందు వుంచువారికి సర్వ ప్రయోజనములు సమకూరుతాయి అని శాస్త్రవాక్యం, మహాత్ముల అనుభవసారం. దైవం సరోవరం – గురువు జీవనది (జంగమ తీర్థాలంటారు గురువులను) మనం దప్పిక తీర్చుకోవడానికి మనకు మనంగా సరోవరం వద్దకు వెళ్లి దప్పిక తీర్చుకోవాలి. నది అలా కాదు. తానే కదలివచ్చి దప్పిక తీర్చుతుంది. అదే సద్గురు అనుగ్రహం. ఇలా సద్గురువనే జీవనది మన దప్పిక తీర్చడానికై, భరతజాతిని భక్తిమార్గంలో పరిప్లావితం చేయడానికై ఊరుఊరునా, వాడవాడనా ఆగుతూ, గలగలా సాగుతూ తనదైన సద్గురు సాంప్రదాయ స్థాపనను గావిస్తూ, జగత్తును సుభిక్షం చేస్తూ సాగిపోతోంది. ఇది సనాతన సాంప్రదాయం. నిత్య నూతన ఆనంద సముదాయం.

## భగవాన్ స్మృతులు

– చలం

ఒక ఉదయం హాలులో అందరూ ధ్యానంలో కూచుని ఉండగా గుమ్మం బయట... కఱ్ఱతో ఎవరో తడుముకుంటున్న చప్పుడు అవుతోంది. చలం అది విని బయటకి వెళ్లి చూస్తే ఒక పొడుగాటి ఉత్తర హిందూస్తానపు రకం మహమ్మదీయుడు తలుపు ఎక్కడ ఉన్నదో అని కఱ్ఱతో తడుముకుంటున్నాడు. ఆయన గుడ్డివాడు. చలం ఆయన చేతిని పట్టుకొని తీసుకొని వచ్చారు. ఆయన ఉర్దూలో – “భగవాన్ ఎక్కడ?” అని అడిగారు. ఆయనని చలం భగవాన్ ఎదురుగా కూచోపెట్టి తెలుగులో, “మీ ఎదురుగా ఉన్నారు భగవాన్, నమస్కరించండి” అన్నాడు. ఆ మాటలు అర్థమైనాయో లేదో కాని, భగవానుని చూస్తున్నట్లే ఆయన ముఖంలో భక్తి, ఆనందం ఆవరించాయి. ఆ మహమ్మదీయుడి భుజాలు పట్టుకొని వొంచి భగవాన్‌కి నమస్కరింపజేశాడు చలం. అక్కడ వున్న ఉర్దూ తెలిసిన భక్తులు అడడగా, ఆయన తన కథ చెప్పారు. ఆయనది పెషావర్ దగ్గర ఒక పల్లెటూరు. ఆయన గొప్ప మౌల్వీ, ఖురాన్ ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు వొప్పగించగలరు. ఉర్దూలోకి తర్జుమా అయిన భగవాన్ పుస్తకం ఒకటి ప్రక్క గదిలో చదువుతుంటే విని, వెంటనే భగవాన్ తనకు జ్ఞానమివ్వగల గురువని నిర్ణయించుకున్నారు. భగవానుని చూడాలని వెంటనే రైలు ఎక్కి వచ్చేసారు, ఆ గుడ్డి ఆయన పెషావరు నుంచి తిరువణ్ణామలై. “సరే, ఇప్పుడేం చేస్తావు?” అని అడిగారు. దానికి ఆయన, “ఇంకేముంది? భగవాన్ ఇష్టం. ఏం చేయమంటే అది చేస్తాను” అన్నారు. భగవాన్ అంతసేపూ ఎక్కడో చూస్తూ కూచూనే ఉన్నారు. ఆ మహమ్మదీయ విద్వాంసుడి విశ్వాసానికి చలానికి సిగ్గేసింది. బెజవాడ నుండి ఈ కాస్త దూరం రావాలంటే ఎంతో శ్రమ చలానికి. ఈ గుడ్డి ఆయన ఇన్ని వేల మైళ్లు ఇన్ని రైళ్లు మారి వచ్చారు. ఆ తురకాయన ఈ దక్షిణాది యోగి చేతులలో పెట్టారు నిస్సహాయంగా తన జీవితాన్ని. భగవాన్ని చూడకుండానే – ఆయన రాసిన రెండు వాక్యాలు విని. చలానికి ఎన్ని సంశయాలు! ఆ సంశయాలను రేపుతున్న మేధస్సుని చూసుకొని ఎంత గర్వం!



# పాదయాత్ర - అనుగ్రహ రస గమ్యయాత్ర

*- బోధన్ శ్రీనివాస్*




జూన్ 15వ తేదీ 2008 సం॥ గురుబంధువుల సాయినామ సంకీర్తనల మధ్య సాయికై తపిస్తూ సాయిపదాలు తాండూరులోని ప్రతీ మనిషిని పలుకరిస్తూ, ప్రతీ తనువును పులకరిస్తూ, సద్గురుదేవులు శ్రీ బాబూజీ ఆకాంక్షను, ఆశయాలను ప్రతిబింబిస్తూ సర్వవ్యాపి అయిన సాయి కోసం శిరిడీవైపు గురుబంధువుల పాదయాత్రగా సాగాయి. పాదయాత్రను గురించి గురుదేవుల మాటల్లోనే చూద్దాం.

**"సాధారణంగా మనమందరం నడుస్తాం. అయితే ఆ నడక ఒక నిర్ధిష్టమయిన ఆశయంతో సాగితే అది పాదయాత్ర అవుతుంది. మనందరికి ఒక గమ్యం ఉంది - అది సాయిబాబా, కనుక మనందరకు గమ్యం శిరిడీ. సాయి అనే మన గమ్యానికి గుర్తుగా సాయినామ సంకీర్తనతో శిరిడీవైపు సాగేదే ఈ పాదయాత్ర. మన జీవితంలో మనం కొన్ని నియమాలను పాటిస్తూ, జీవితాన్ని క్రమబద్ధం చేసుకోవాలని యత్నిస్తాము. అయితే, కొన్నిటిని పాటించడం కుదరక, పాటించే పరిస్థితులు లేక వాటిని ప్రక్కన పెడతాం. అయితే, ఈ పాదయాత్రలో మనం ఇలాంటి నియమాలను పాటించడానికి విస్తారమైన అవకాశం ఉంది. మన ఆనందం చాలా అంశాలమీద ఆధారపడి ఉంటుంది. మంచి భోజనం, రకరకాల వంటలు, పరుపు, ఫ్యాన్, ఎ.సి., నిశ్శబ్ధంగా ఉన్న గది... ఇలా ఇవన్నీ ఆనందాన్ని ఇస్తాయని భావిస్తాం. కానీ, ఇవన్నీ లేకుండా చాలా తక్కువ వనరులతో ఎలా జీవించగలం? తాత్వికంగా చూస్తే ఇవన్నీ కాదు ఆనందాన్ని ఇచ్చేది అని మనకు తెలుసు. అలా తక్కువ వనరులతో జీవిస్తూ కూడా ఆనందంగా ఉండగలగడానికి ఈ పాదయాత్రను నాందిగా చేసుకుందాం. మన వంటిపై ఒక జత బట్టలు, మరొక జత మనతో! నడక సాగిద్దాం, ఎక్కడ బాబా అవకాశమిస్తే అక్కడ నిద్రించడం, మనతో ఉన్న బట్టల జతను ఒంటిపై వేసుకోవడం, అప్పటి వరకు ఉన్నది శుభ్రం చేసుకోవడం. ఇలా ఒకటి, రెండు నెలలు సాగుతూ పాదయాత్ర శిలధి(శిరడీ) చేరేనాటికి అతితక్కువ వనరులతో జీవించడానికి మనం పూర్తిగా అలవడి అలా జీవించగలమన్న విశ్వాసం మనలో బలపడుతుంది. చాలామంది మనం ఇలా జీవించగలమంటే నమ్మలేరు కూడా! ఇలాంటి నిర్ధిష్టమయిన ఆశయంతోనే పాదయాత్ర అనే సత్సంప్రదాయం ఆవిష్కరించబడింది".** గురుదేవుల ఆకాంక్ష ఇది, ఆశయమిది. లక్ష్య సాధకులైన గురుబంధువుల పాదయాత్ర శిరిడీవైపు సాగిపోతోంది. గురుకృప మీ చేతికి చేరిన ఈ సమయానికి పాదయాత్రలోని సాయిపదాలను మీతో పంచుకోవడానికి శిరిడీలో సిద్ధంగా ఉన్నారు. పాదయాత్ర జరుగుతున్న సమయంలో గురుబంధువులు గురుకృపతో పంచుకున్న అనుభవాలు మీతో... సద్గురు అనుగ్రహంతో మా పాదయాత్ర చాలా ఆనందంగా సాగుతోంది. ప్రతిరోజూ, ప్రతి నిమిషం మీ తోడు ఉన్నానంటూ గురుదేవులు అందిస్తున్న అనుభవం మమ్ములను అలుపెరుగక సాగిపోనిస్తోంది. సాయివైపు, శిరిడీవైపు. సాగుతున్న మా

యాత్రలో ఒకరోజు సుమారు 20 కి.మీ. నడక తరువాత ఒక గుడిలో ఆగాం. అందరం బాగా అలసిపోవడంతో నిద్రకు సిద్ధమవుతున్నాం. ఇంతలో తెలిసింది ఆ రోజు ఏకాదశి అని. ఆ ఊరిలో ప్రతి ఏకాదశికి భజన కార్యక్రమం జరుగుతుందట. దాంతో మేము అక్కడ విశ్రమించినా నిద్రలేమితో ఎవ్వరమూ కూడాను తరువాత రోజు నడక సాగించే స్థితిలో లేము. ఉదయం నడక ప్రారంభించాము. సుమారు రెండు కిలోమీటర్లు నడిచాక మాలో గురుబంధువొకరు పచ్చని పైరుల మధ్య ఆలయాన్ని చూపాడు. ప్రకృతి మనోహరాన్ని చూసి మేమందరం పులకరించాం. అందరి పరిస్థితి చూసుకొని, ఆరోజు అక్కడే ఆగే తరువాత రోజు యాత్రను కొనసాగిద్దామని భావించాం. పొలాల మధ్య నుంచి ఆలయానికి వెళ్తున్న మాతో కలిసి రోడ్డు మీద నుంచి ఒక చిన్న బాబు వచ్చాడు. కొంత సమయమయ్యాక మేము ఎక్కడ నుంచి వస్తున్నామని, ఎక్కడకు వెళ్తున్నామని ఆరాతీసి, మీకు భోజనం ఎట్లా అని అడిగాడు. ఏ ఏర్పాట్లు లేవని, బాబా ఎలా ఏర్పాటు చేస్తారో చూడాలని అనుకున్నాం. కొంతసేపు గడిచింది. ప్రకృతి పారవశ్యంలో సాయి నామాన్ని అందరం ఆస్వాదించాం.

భోజన సమయానికి ఆ చిన్నబాబు తన తండ్రిని వెంటబెట్టుకుని ఆలయంలో మన గురుబంధువులున్న చోటికి చేరాడు. అతనిని చూస్తే అతనొక రైతుకూలీ! అతని వేష, భాషలు చూస్తే చాలా పల్లెటూరివానిలా, వేషధారణపట్ల ఆసక్తి లేని వానిగా కనిపించాడు. అయితే అతను మా 18 మంది గురుబంధువులకు రొట్టె, కూర, పచ్చడి తెచ్చాడు. సంతృప్తిగా మాకు వడ్డించాడు. సాయిమాయి ప్రేమను చూసి మా కళ్లు చెమర్చాయి. సద్గురుదేవుల కరుణామృతం మాపై వెల్లువలా వర్షించింది. అతనికి డబ్బులు ఇవ్వబోతే ససేమిరా అన్నాడు. ప్రేమంటే ఇది కదా! శిరిడీ చేరి బాబాకు నమస్కారాలు తెలుపమని వేడుకున్నాడు. ఆకలి తీర్చాడు. అమ్మప్రేమను పంచాడు ఈ రూపంలో మాపై! ఆ చిన్నబాబు వెళ్లి వాళ్ల నాన్నతో చెప్పాడట - అక్కడ కొంతమంది యువకులు శిరిడీకి పాదయాత్రగా వెళ్తున్నారు, వాళ్లకు భోజనం లేదు, మనం తీసుకువెళ్దామని! సరే! ఇదంతా ఒక ఎత్తయితే తర్వాత తెలిసిన విషయమేమంటే ఆ ఆలయం దాటి ముందుకు వెళితే 22 కి॥మీ॥ తర్వాతనే ఒక ఊరు ఉందట. బిడ్డల ఆకలిని, అలసటను గమనించిన బాబా మమ్ములను ఖాళీ కడుపులతో పాదయాత్ర చేయకుండా కాపాడదలచారని అవగతమయింది. మేము సాగుతున్న ప్రతిరోజూ కేవలం మేము నడక సాగిస్తున్న ప్రాంతంలో తప్ప అంతా వర్షం పడుతోంది. కానీ తాండూర్ నుంచి ఇప్పటి వరకు అంటే సుమారు 590 కి॥మీ॥ ఒక్కసారి కూడా మేమవ్వరం తడవలేదంటే అది సద్గురు అనుగ్రహం కాక మరేమిటి? ఇలా ఎన్నో అనుభవాలు - ఎన్నో సాయి లీలా వినోదాలు. క్షమించండి - నా సహచరులు సాగిపోతున్నారు శిరిడీవైపు, సద్గురు ప్రణాళికా పథంలో సాగుతోంది మా పాదయాత్ర - అది అనుగ్రహ రసరమ్య గమ్య యాత్ర.



మరోచోట ఆగినపుడు మరికొన్ని విశేషాలు మీతో..


# సద్గురుతత్త్వం...

సాధకుని అనుక్షణం కంటికి రెప్పవలే కాపాడి,
సాధకుని లోని వెలితిని తొలగించి, వెతలను తీర్చి,
వెలుగు మార్గంలో పయనింపచేసి,
జ్ఞానజ్యోతిని ప్రసాదించే మహోదారమూర్తికి
మరో మంచి పేరు 'సమర్థ సద్గురువు'.
బాబా కోవలోనే ఈ ఆణిముత్యం..

–సాయిపథం

"గురువు, శిష్యుడిలో నిద్రపోతున్న
దేవుడిని మేల్కొలుపుతున్న, మేలుకున్న దేవుడు".
సర్వమానవుల్లో అత్యుత్తమ ప్రదాత గురువు.
సద్గురు ఔదార్యం పరిమితులెరగనిది.
సద్గురుని జీవితం దేవుడి అనిరుద్ధ వ్యక్తీకరణం.

–స్వామి శంకరాచార్య



www.guruji.org

పరమపావనమైన గురుదేవు పదములు పట్టి భజియింపవే మనసా!
పరతత్త్వమునుగని మరల జన్మకు రాని పదములు చేర్చవే మనసా!
పరిపరి గతులను పరిగెత్తుచూ నీవు గురు మహిమ మరువకే మనసా!



మరువకు ఎప్పుడూ గురుదేవుడొక్కడే పరమబంధువుడగునే మనసా!
శరణు శరణననుచును స్మరణ మాత్రముననే కరుణ కురిపించునే మనసా!
పరమపావనమైన సద్గురుని చేరి ఆనందమొందవే మనసా!